
# మంచుదీపం



ఆకాశపు వాకిళ్ళ నిండా చుక్కలు చమక్ చమక్‌మని మెరిసేవేళ—

కోనల పొదరిళ్ళలో పిట్టలు ఒదిగొదిగి నిద్రించేవేళ—మూడో అంతస్థు బాల్కనిలో వాలుకుర్చీలో చేరబడి ఎదురింటి పచ్చని పచ్చికలో ఆడుకుంటున్న పాపల్ని, బాబుల్ని తదేకంగా చూస్తుంది అర్చన.

ఆమెకు అమర్ గుర్తొచ్చాడు.

ఎన్నో సాయంత్రాలు తను—అమర్—కాలనీలో పిల్లలు కలిసి ఎన్నెన్నో ఆటలు ఆడారు. మరెన్నో పాటలు పాడారు. ఇంకెన్నెన్నో అల్లరి పనులు చేశారు.

డిగ్రీవరకు ఒకేచోట చదువుకున్నారు.

డిగ్రీ పూర్తిచేశాక ఆమె జర్నలిజంలో, అతను ఎం.బి.ఎలో చేరారు.

అంబరం వసుధని అభిషేకిస్తున్నట్లు రాల్తున్న చిన్ని చిన్ని పువ్వుల్లా చిన్ని చిన్ని చినుకుల్లో తడుస్తు నడుస్తున్న అర్చన ఎదతోటలో గుబులు మొగ్గలు మొగ్గలుగా ముదుచుకుంటుంటే అప్పుడు తెల్సిందామెకి అమర్‌ని స్నేహితుడిగానే కాకుండా ఇంకా ఎక్కువగానే తన మనసు కోరుకుంటుందని.

అతని ఇంటివైపు త్వరత్వరగా అడుగులేసింది.

కాలింగ్ బెల్ నొక్కింది.

తలుపు తీసిన అమర్ ''అర్చనా!'' అంటూ మిలమిలా మెరిసే కళ్ళతో, తడబడే అధరాలతో నిలబడి పోయాడు.

''అబ్బా! నిన్ను చూసి మూడురోజులైంది.'' అందామె.

''నువ్వు లేకుండా క్లాసుకి వెళ్ళాలనిపించడం లేదు. నువ్వూ ఎం.బి.ఎలో చేరాల్సింది'' అన్నాడు అమర్.

''ఎం.బి.ఎపై నాకు ఆసక్తి లేదు. సీటైతే రెండింటిలో వచ్చింది. కాని నీకు జర్నలిజం

కుప్పిలి పద్మ

లో ఆసక్తి లేదు. అందుకే అది వదిలి ఎం.బి.ఎలో జాయిన్ అయ్యావు. ఇప్పుడే మా క్లాసుకి నేలేకుండా వెళ్ళలనిపించడం లేదంటున్నావ్'' అందామె.

"నీకు ఎం.బి.ఎలో సీట్ వచ్చేదే. కాని నువ్వు ఎంట్రన్స్ రాయలేదుగా. జర్నలిజం మాత్రమే రాశావు'' అన్నాడతను.

"నాకు జర్నలిజం అంటేనే ఆసక్తి. ఇందులో సీట్ రాకపోతే కరస్పాండెన్స్ కోర్సులోనైనా చదివేదాన్ని. మనకి ఆసక్తి వున్న దాంట్లో సీట్ వస్తుందనే గ్యారంటీ లేని రోజుల్లో నాకు అవకాశం వస్తే నేనెలా వదులుకుంటాను. అలాగే నీకు నీకిష్టమైన దాంట్లో సీట్ వచ్చింది. ఒకర్నొకరు ఎలా చూసుకోవాలి అన్నది సమస్య కాదు. రోజు సాయంత్రం కలుద్దాం. సెలవుల్లో కలవచ్చు. చదువులు పూర్తి అయ్యే వరకే కదా ఈ సమస్య. చదువై ఉద్యోగం వచ్చాక మనం ఎలాగా పె......'' చప్పున ఆపేసింది.

అతని అధరాలపై చిలిపినవ్వు అల్లరల్లరిగా కదుల్తుండగా "ఆపేశావేం" అన్నాడు.

గులాబిరంగు ఝుంఝుంమని బుగ్గలపై చిందులేస్తుండగా "నువ్వు పూర్తి చేస్తావని" అంది.

"మూడు ముళ్ళు వెయ్యాలి. అంతేగా" అన్నాడు.

"ఊహూ! నాకు అటువంటివి నచ్చవ్. ఇద్దరం సమానస్థాయిలో సంతకాల పెళ్లి చేసుకుందాం'' అందామె నవ్వుతూ.

"బాగున్నావా అర్చనా'' అంటూ టీ కప్పుతో గదిలోకి అమర్ తల్లి రావడంతో సంభాషణ కాలక్షేపం కబుర్లవైపు తిరిగింది.

... ... ...

అర్చన చదువు పూర్తి చేసింది.

ఓ జాతీయ దినపత్రికలో సబ్—ఎడిటర్ గా ఉద్యోగం వచ్చింది.

"ఇదిగో ఇన్విటేషన్'' కార్డు అందుకుంటూ అడిగాడు అమర్.

"మా ఆఫీసులో ఫంక్షన్ వుంది. సినిమావాళ్ళకి అవార్డు ఇమ్మన్నారు. కల్చరల్ ప్రోగ్రామ్స్ చాలా వున్నాయ్. తప్పకుండా రా'' అందామె.

"వస్తాను'' అన్నాడతను.

ఆమె ఆఫీసుకి టైమ్ అవుతుందని వెళ్ళిపోయింది.

... ... ...

నిండు జాబిలి తిరిగ్గా ఉదయించే వేళ. ఆ ఆవరణంతా రంగురంగు వస్త్రాల్లా యువతి యువకులు మెరిసిపోతున్నారు.

ఆనందం—అందం—ఉత్సాహం—కళాత్మకత గుత్తులు గుత్తులుగా సంపెంగ పువ్వుల్లా వెల్లివిరిసే ఆ ప్రాంగణంలోకి అడుగు పెట్టాడు అమర్. అతని కళ్ళు అర్చన కోసం వెతకబోతుంటే "హాయ్'' ఎదురొచ్చి చిర్నవ్వుతో పల్కరించిందామె.

గుండ్రని ముఖం—పెద్దపెద్ద కళ్ళూ—పల్చని అధరాలు, నునుపైన నిండైన బుగ్గలు—పచ్చని ఛాయ—ఒత్తైన నల్లని బాబ్డ్ హెయిర్—గులాబిరంగు చూడీదార్‌లో అందంగా, ఆరోగ్యంగా, ఒకింత గ్రేస్‌తో గొప్ప ఆకర్షణీయంగా కన్పిస్తున్న అర్చనతో నాలుగు అడుగులు వేశాడు.

"హల్లో'' అంటూ ఇద్దరబ్బాయిలు అర్చనని పల్కరించారు.

మరో నాలుగు అడుగులు వెయ్యగానే "హాయ్'' అంటూ ముగ్గురు అబ్బాయిలు, ఇద్దరమ్మాయిలు పల్కరించారు.

వాళ్ళంతా అర్చన పనిచేసే పత్రికాఫీసులో పనిచేస్తున్నారు.

అందమైనవాళ్ళు, చదువుకున్నోళ్ళు, కళల పట్ల అభిరుచి—జీవితంపట్ల అభిమానం వున్నవాళ్ళు.

సౌందర్యానికి—ఉత్సాహానికి—ధీరత్వానికి ప్రతీకగా వుందా ప్రదేశం. అర్చన అమర్‌ని పరిచయం చేసింది. వాళ్ళెవరో అమర్‌కి వివరించింది.

అర్చన ఉత్సాహంగా ప్రోగ్రాంని చూస్తుంటే, అమర్ అంతులేని ఆలోచనల్లో కొట్టుకుపోయాడు.

ఎవరితో ఏపనీ లేని కాలం ఎప్పటిలానే తిరుగుతోంది.

... ... ... ...

ఫంక్షన్ జరిగిన పదిరోజుల తర్వాత ఒకానొక సాయంత్రం గులాబి హోటల్లో కూర్చుని అర్చన కోసం ఎదురుచూస్తున్నాడు అమర్.

అర్చన వస్తానని చెప్పిన సమయం దాటి పది నిమిషాలైంది. ఎందుకు రాలేదో?

ఆఫీసులో ఎవరైనా అబ్బాయి కబుర్లు చెపుతుంటే వింటూ కూర్చుందా?

లేకపోతే ఐస్‌క్రీం ఇప్పిస్తానంటే ఐస్ మూన్ రెస్టారెంట్‌కి వెళ్ళిందా?


"హాయ్''

తలెత్తి చూశాడు.

తెల్లటి బ్లౌజు, స్నఫ్‌కలర్ మీద తెల్లని చుక్కలున్న స్కర్టూ— అలసిన బుగ్గలు—మెరిసే కళ్ళు—ఎగిరే బాబ్డ్ హెయిర్‌తో ఎప్పటిలా అధరాలు చిర్నవ్వుతో విచ్చుకుంటుండగా వచ్చి అతని ఎదురుగా కూర్చుంది.

"లేట్ అయిందేం''

"బండిలో పెట్రోల్ అయిపోతుంది. వేయించాలని బంక్ దగ్గర ఆగాము. పెద్ద క్యూ'' అందామె.




ఉదయం వారపత్రిక

నిజమేనా?

అబద్ధం చెపుతుందా?

అమర్‌కి నవ్వొచ్చింది

ఇదేంటి ఇలా ఆలోచిస్తున్నాను. కలుసుకోవాలనుకున్న టైంకి అటో ఇటో అవ్వడం ఇద్దరికి అలవాటే. కాని ఇప్పుడిలాంటి ఆలోచనలు ఎందుకొస్తున్నాయి.

అర్చన చుట్టూ రంగురంగుల ప్రపంచం వుందని– ఏదో ఒక రంగు ఏదో ఒక రోజు ఆకర్షిస్తుందని భయం.

భయమేనా? ఉత్తి భయమేనా?

అంతకు మించి ఏం లేదా?

అనుమానమా?

పసితనపు తీరాన నిల్చుని.. చెయ్యిచెయ్యి కలిపి ఆకాశ మైదానంవైపు చూస్తూ ''ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్'' అంటూ మురిసిపోయింది ధగధగా మెరిసిపోయే అనురాగపు వెలుగు కోసమా? వెలవెలపోయే అనుమానపు నిశీధి కోసమా?

అతడో నిర్ణయానికి వచ్చాడు.

''నాకు ఉద్యోగం దొరికింది. మన పెళ్ళికి మీ ఇంట్లో ఒప్పుకోరు. మా ఇంట్లోనూ ఒప్పుకోరు. రిజిస్టర్ మేరేజ్ చేసుకుందాం'' అన్నాడు అమర్.

''అలాగే'' అందామె.

''ఫ్రెండ్స్‌కి డేట్ ఫిక్స్‌చేసి చెపుదాం'' అన్నాడు.

''ఆ డేట్ తెలిశాక నే లీవ్ అప్లయి చేస్తాను. అప్పటికప్పుడు దొరకడం కష్టం'' అందామె.

''లీవ్ ఎందుకు? రిజైన్ చెయ్యి'' మామూలుగా అనడానికి ప్రయత్నిస్తూ అన్నాడతను.

ఆమె ఆశ్చర్యంగా ''రిజైనా'' అంది.

''ఆ!''

''ఎందుకు''

''ఇంటిపని, ఆఫీసుపని కష్టం కదూ''

''ఇంటిపనా? ఇద్దరి మనుషులకి ఇంటిపని ఎంతుంటుంది. సైన్స్ అభివృద్ధి చెందడం వలన మేం గొప్పగా సుఖపడి పోతున్నాం. ఆ ఈ మాత్రానికే ఉద్యోగం మానెయ్యాలా'' నవ్వుతూ అందామె.

''నాది మంచి ఉద్యోగం. బాగా జీతం వస్తుంది. అది మనిద్దరికి అన్ని కంఫర్ట్స్‌తో బతకడానికి సరిపోతుంది. నీకెందుకీ వృధా శ్రమ'' అన్నాడతను.

''అరే పిచ్చి! నీకు జీతం బాగారాదని కాదు. అసలు నాకీ ఉద్యోగంలో శ్రమేం లేదు. పైగా రోజురోజుకి ఆలోచనల్లో షార్పునెస్ వస్తుంది. చాలా ఇంట్రస్టింగ్ జాబ్. ఇంట్లో కూర్చుని నేనేం చెయ్యాలి'' అభిమానంగా అతడిని మందలించిందామె.

''అది కాదు అర్చనా! పిల్లలకి కష్టం'' నచ్చ చెపుతున్నట్లు అన్నాడు.

''ఏ పిల్లలు'' అయోమయంగా అందామె.

''మన పిల్లలు''

''ఇంతసేపు నేనేదో శ్రమ పడతానని గొప్ప అభిమానం చూపించావ్. ఇప్పుడేమో ఎప్పుడో పుట్టబోయే పిల్లలపై ప్రేమని కురిపిస్తున్నావ్ ఏంటి అసలు విషయం. పెళ్ళి అయ్యాక ఉద్యోగం చెయ్యడం నాకేం ఇబ్బంది కాదు. నీకేమైనా వుంటే చెప్పు'' సూటిగా అడిగిందామె.

ఏం చెప్పి ఆమెని ఒప్పించలేమనే విషయం అమర్‌కి తెలిసిపోయింది.

''మనిద్దరం బాల్యం నుండి స్నేహితులం. పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం. ఈ ఉద్యోగం అనేకాదు ఏ ఉద్యోగంలో జాయిన్ అయినా అక్కడా అందమైన, తెలివైన యువకులుంటారు. పెద్దవాళ్ళూ వుంటారు. రకరకాలైన మగవాళ్ళ మధ్య పనిచేస్తుంటే ఏదోరోజు వాళ్ళలో ఎవరో ఒకరు నిన్ను ఆకర్షించవచ్చు. విధి నిర్వహణలో ఎన్నెన్నో చర్చిస్తారు. వాళ్ళపై నీకు ఆసక్తి కలగొచ్చు. నువ్వు నిజాయితీగానే వుండొచ్చు. నీపై ఎవరైనా ఇష్టాన్ని పెంచుకోవచ్చు. ఎవరైనా అబ్బాయి అందమో, తెలివితేటలో నీకు ముచ్చట కలిగి నాతో వూరికే వాళ్ళ గురించి చెప్పవచ్చు. అటువంటప్పుడు నువ్వు వాళ్ళకి దగ్గరవుతావేమోననే బెంగ నాకు రావొచ్చు. ఎందుకిన్ని అనుమానాలు, సమస్యలు. ఏదో రోజు అసూయతో నేను నిన్నో మాట అనొచ్చు. మన అందమైన బంధంలో అటువంటి వికారపు మచ్చలెందుకు? నువ్వు ఉద్యోగం మానేసి గృహిణిగా ఇంట్లో వుండటం నా కిష్టం'' స్పష్టంగా చెప్పాడు అమర్.


చెళ్ళు చెళ్ళున వడగళ్ళు బుగ్గలని తాకిన్నట్లు విలవిల లాడిందామె. పది నిమిషాలు గడిచాయ్.

ఆమె మాటలు మర్చిపోయినట్లు మెర్క్యూరి దీపాల వెలుగులో వింతవింతగా మెరుస్తున్న రంగు రంగు గులాబీల లేతదనాన్ని చూస్తుంది.

''నాకు భార్యవి కావాలంటే ఉద్యోగం చేయకూడదు. ఉద్యోగస్తురాలిగానే వుండాలనుకుంటే నా భార్యవి కాలేవ్. నిర్ణయించుకుని చెప్పు''అన్నాడతను.

ఇద్దరూ మౌనంగా ఎవరిళ్ళవైపు వాళ్ళు నడిచారు.

చిన్ని చిన్ని కెరటాల సవ్వడిలాంటి పిల్లల కేరింతలు ఆగిపోయాయి. నిశ్శబ్దం అర్చనని ఆలోచనల నుండి వెలుపలికి తెచ్చింది.



ఉద్యోగం మానెయ్యాలా?

అమర్‌ని ఒదులుకోవాలా?

ఇవి పైకి కన్పిస్తున్న ప్రశ్నలు.

ఈ ప్రశ్నల వెనుక నిగూఢంగా జాతిజాతినే కదిలించే సమస్య వుంది.

ఇది ఒక్కరి సమస్యా!

కాదు

అర్చన ఇంట్లోకి వచ్చింది. ఎప్పటిలా కాసేపు చదువుకుంది. భోజనం చేసింది. డైరీ రాసింది. మరేం ఆలోచించకుండా నిద్రపోయింది.

... ... ...

''గుడ్ మార్నింగ్''

తలొంచుకుని చకచకా ముందున్న ఫైల్స్‌లో కాగితాలపై సంతకాలు పెట్టేస్తున్న అమర్ చప్పున తలెత్తి చూశాడు. అప్పుడే విచ్చిన లిల్లీపువ్వులా వైట్ చూడీదార్‌లో చిర్నవ్వుతో అర్చన.

రవ్వంత ఆశ్చర్యం, కాసింత సంతోషం అమర్‌లో.

ఎప్పుడూ లేంది ఎంటిలా చెప్పాపెట్టకుండా ఆఫీస్‌కి వచ్చేసింది. ఉద్యోగం రిజైన్ చేస్తుందా? అది చెప్పడానికి వచ్చిందా?

ఇంతలో ఓ అమ్మాయి తలుపు తీసుకుని గదిలోకి వచ్చింది. టెండర్ గురించి కొన్ని పర్టిక్యులర్స్ తీసుకుని వెళ్ళింది. ఆ అమ్మాయిగదిలో వున్నంతసేపు అర్చన గాజు అద్దాల్లోంచి బయటహాల్లో కన్పిస్తున్న రంగు రంగు గాజు పూసల్లాంటి అమ్మాయిల్ని చూస్తూ కూర్చుంది.

''మీ ఆఫీసులో చాలామంది అమ్మాయిలున్నారే'' అందామె.

''అబ్బాయిల కంటే అమ్మాయిలే బాగా పనిచేస్తారు'' అన్నాడతను.


''నిజమా!'' అంటూ చిన్నగా నవ్వింది.

అతడు తడబడుతూ ఆ నవ్వులో ఏమైనా వ్యంగ్యం వుందేమోనని చూశాడు.

అటువంటిదేం లేదు. జాలి తప్ప.

''మన విషయం ఏం ఆలోచించావ్'' అడిగాడతను.

''స్త్రీ ఆత్మగౌరవానికి ప్రతీక ఉద్యోగం చెయ్యడం కావచ్చు, కాకపోవచ్చు. నా



విషయంలో నే ఉద్యోగం చెయ్యడం హాబీకోసం కాదు. టైంపాస్‌కి కాదు. ధనార్జనకీ కాదు. సమానహక్కు అనే పంతం కాదు. నా వృత్తిలో నే తృప్తిని పొందాను. సంతృప్తి చెందాలని ఆరాటపడుతున్నాను'' అని ఆగి టేబిల్‌పై వున్న పేపర్ వెయిట్‌లో అల్లిబిల్లి రంగుల్ని చూస్తూ ''నా దృష్టిలో వివాహం తప్పనిసరిగా జరగాల్సిన తంతుకాదు. భద్రతకోసం కాదు. భృతికోసం కాదు. అనురాగానికి, ఆప్యాయతని ఆలంబనగా, శాంతికి అంతులేని గనిలా వుండాలనుకుంటాను. కాని నువ్వేమో ఉద్యోగం చేస్తే ఏ ఆకర్షణకి లొంగిపోతానో, లోబడతానో అని భయపడుతున్నావ్. నువ్వూ ఉద్యోగం చేస్తున్నావ్. నీ చుట్టు అమ్మాయిలు ఉన్నారు. నేనూ నీలా ఆలోచిస్తే?'' అందామె.

అతడు బిత్తరపోయాడు.

అతడి జవాబుకోసం ఆగకుండా ''ఉద్యోగం చేస్తేనే అబ్బాయిలు తెలుస్తారనుకోవడం నీ భ్రమ. ఉదయం నువ్వు ఆఫీసుకి వెళితే సాయంత్రం తిరిగొస్తావ్. ఈ లోగా నే పక్కింటి వాడితోనో, పాలవాడితోనో, వీధి చివర వాడితోనో కబుర్లు చెప్పవచ్చు. సినిమా కెళ్ళొచ్చు, పేకాడొచ్చు. అప్పుడేం చేస్తావ్. ఇంటికి తాళం వేసి వెళతావా?'' అందామె.

''ఛ!ఛ. మరీ అలా మాట్లాడకు''వారింపుగా అన్నాడు.

ఆమె పేలవంగా నవ్వి ''ఎందుకు మాట్లాడకూడదు. ఆకాశానికి అనుమానానికి హద్దేంటి? నిన్ను మారమని, నీ ఆలోచనలని సరిచేసుకోమని నే చెప్పను. నీ ఆలోచన—అభిప్రాయాలు నిజమేనని సమర్థించే ప్రజలు వుండొచ్చు. నన్ను సమర్థించేవారు వుండొచ్చు. ఎవరి ఇష్టాలు, అభిప్రాయాలు వాళ్ళవి. కాని అవి మరొకరిని హింసించకూడదు. నీలో భావాలు తెల్సి బాధపడ్డాను. పడుతున్నాను. వాటిని ఆమోదించ లేకపోతున్నాను. అదే సమయంలో నీతో కలిసి జీవితం గురించి అల్లుకున్న వూహల పొదరిళ్ళు గుర్తొస్తున్నాయ్. స్నేహం, ఆప్యాయత అంటూ నీకోసం ఎక్కడెక్కడికో వచ్చిన విషయాలు, ఎదురు చూసిన సంఘటనలూ కళ్ళముందు కదులుతున్నాయ్. ఇవి గుర్తొస్తే పెళ్ళి చేసుకోవాలనిపిస్తుంది. ఉద్యోగం మానెయ్ అనే మాటలు గుర్తొస్తే చేసుకోవాలనిపించదు'' అందామె.

''ఏం నిశ్చయించుకున్నావ్'' ఆత్రుతగా అడిగాడు.

''నేను పొరపాటు తెలుసుకున్నాను. ఉద్యోగం మానొద్దు. వివాహం చేసుకుందాం'' అని గొప్ప పశ్చాత్తాపంతో అతనంటాడని ఆమె ఆశపడలేదు. కాబట్టే ఆ క్షణంలో 'అతడిని చూసి ''ఛీ! నికృష్టపు బుద్ధి'' అని అనుకోలేక పోయింది.

''నే ఉద్యోగం మాని నిన్ను పెళ్ళి చేసుకొని ఏ క్షణంలో నువ్వేవిధంగా అనుమానిస్తావో అని క్షణక్షణం ఎదురుచూస్తూ కూర్చోలేను. నే ఉద్యోగం మానడంలేదు'' అని ఆమె అతని గదిలోనుండి వెలుపలికి వచ్చింది. ●